క్లుప్తంగా

ఘనంగా అయ్యప్ప జ్యోతి ప్రజ్వలన

కోట : స్థానిక వినాయకస్వామి ఆలయం వద్ద అయ్యప్ప భక్త బృందం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఘనంగా జ్యోతి ప్రజ్వలన చేపట్టారు. శబరిమలైలో మకరజ్యోతి దర్శన సమయంలో భక్తులు సమర్పించిన 160 కేజీల కర్పూరం వెలిగించారు. స్వామిని కీర్తిస్తూ భజనలు చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప శరణు ఘోషతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కిడ్నీ బాధితురాలికి ఆర్థిక సాయం



బాధితురాలి కుటుంబీకులకు నగదు అందిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

చిల్లకూరు : మండలంలోని నెలబల్లిరెట్టపల్లె పంచాయతీ నక్కల కాలువ కండ్రిగలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న జయమ్మ అనే మహిళలకు రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వారు మంగళవారం ఆర్థిక సాయం అందించారు. ట్రస్ట్ అధినేత శ్రీనివాసులు మాట్లాడుతూ కిడ్నీ వ్యాధిగ్రస్తులైన మహిళలకు అండగా ఉంటామన్నారు. జయమ్మకు వైద్య ఖర్చులకు చేయూత అందించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు పిచ్చయ్యనాయుడు,రామానాయుడు,శిరీష, బాబు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ

గూడూరురూరల్ : పట్టణంలోని ఓం సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రంలో మంగళవారం వృద్ధులకు రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వారు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ట్రస్ట్ అధినేత శ్రీనివాసులునాయుడు, శిరీష దంపతులు పిండి వంటలు అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శులు రామయ్య నాయుడు, వెంకటేశ్వర్లు నాయుడు, సభ్యులు బాబు, భాస్కర్, రెడ్ సంస్థ ప్రతినిధులు సుధీర్, రాజేష్, ఆశ్రమ నిర్వహకులు కల్యాణి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు నివాళి

దక్కిలి (బాలాయపల్లి): మండలంలోని పిగిలాం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేత మావిళ్లపల్లి రమణయ్య నాయుడు మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి గ్రామానికి చేరుకుని రమణయ్య నాయుడు భౌతికకాయానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెందోటి కార్తీక్‌రెడ్డి, స్థానిక నేతలు కృష్ణమనాయుడు, వెంకటరామానాయుడు, శ్రీహరి, మహేంద్ర, మస్తాన్, గోపాల్ యాదవ్ పాల్గొన్నారు.

కనుమా.. సంక్రాంతి సంబరం

- వేడుకగా పెద్దల పండుగ
- గౌరమ్మకు విశేష పూజలు
- పంతగులతో పిల్లల సందడి
- పశువులకు ప్రత్యేక అలంకరణ



గౌరమ్మ గ్రామోత్సవంలో మహిళలు, పిల్లల సందడి



జెండా ఊపి పోటీలు ప్రారంభిస్తున్న సత్యనారాయణరెడ్డి

వెంకటగిరిరూరల్ : సంక్రాంతి, కనుమ పండుగలను ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. ఇంటింటా పితృదేవతలను స్మరించుకుంటూ దుస్తులు సమర్పించుకున్నారు. రైతులు పశువులను ప్రత్యేకంగా అలంకరించి పరుగులు తీయించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో గౌరమ్మకు పూజలు నిర్వహించారు. పట్టణంలోని కాశితోట వద్ద గొబ్బిపాటలు పాడుతూ సందడి చేశారు. అనంతరం కైవల్యా నదిలో నిమజ్జనం చేశారు. చిన్నారులు గాలి పటాలు ఎగురవేశారు. పట్టణంలోని వెలమ్మపాళెం, బంగారుపేటలో మహిళలు గౌరమ్మను విశేషంగా అలంకరించి వేడుకలు నిర్వహించారు.

నాయుడుపేటటౌన్ : పట్టణంలో సంక్రాంతి, కనుమ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పలువురు అధికారులు, నేతలు సూళ్లూరుపేటకు వెళ్లి ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సైదాపురం : సంక్రాంతి శోభతో పల్లెలు కళకళలాడాయి. మహిళలు తమ ఇళ్ల ముందు గొబ్బెమ్మలు, రంగవల్లులను తీర్చిదిద్దారు. పెద్దపండుగ నాడు ఇంటికి వచ్చిన దేవరులు, బ్రాహ్మణులు, హరిదాసులకు కానుకలు సమర్పించారు.

గూడూరురూరల్ : పట్టణంలోని ఆదిశేషారెడ్డి స్టేడియంలో ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో బిళ్లంగొడు, బొంగరాలు, గోలీలు, లక్కీ కార్నర్ ఆటలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు బండి ధనుంజయరెడ్డి, ట్రెజరర్ కాటూరు శ్రీనివాసులు, యోగా మాస్టర్ రాజా, సభ్యులు రామ్మోహన్‌రావు, పీడీ కరీముల్లాఖాన్ పాల్గొన్నారు.

పెళ్లకూరు : కనుమ పండుగను పురస్కరించుకుని చిల్లకూరు వడ్డిపాళెంలో ఎడ్ల పందేలు నిర్వహించారు. ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పోటీదారులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ పగడాల హరిబాబురెడ్డి, మాజీ సర్పంచ్ గురవయ్య పాల్గొన్నారు.

వైభవంగా 'కొండ ఉత్సవాలు'



శిరసనంబేడులో ఊరేగుతున్న సిద్ధేశ్వరస్వామి



రోసనూరులో భూపతీశ్వరస్వామి ఊరేగింపు

పెళ్లకూరు : మండలంలోని శిరసనంబేడు, రోసనూరు గ్రామాల్లో మంగళవారం వైభవంగా కొండ ఉత్సవాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సిద్దేశ్వరస్వామి, భూపతేశ్వరస్వామిని ఊరేగించారు. ఈ సందర్భంగా వీధులను విద్యుద్దీపాలతో అలంకరించారు. చలువ పందిళ్లు వేశారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాలు, బాణ సంచా పేలుళ్ల నడుమ ఉత్సవర్లను ఊరేగింపుగా సిద్దేశ్వర కొండ, భూపతీశ్వర కొండల చుట్టూ ప్రదక్షిణ చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గుంటపూడి పెంచలయ్య, శనగ రాజయ్య, నాయకులు శిరసనంబేటి చైతన్యకృష్ణారెడ్డి, వేలూరు మురళీకృష్ణారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, శ్యామ్‌రెడ్డి, కల్యాణ్‌రెడ్డి, రామకృష్ణంరాజు, మోహన్, హరిబాబు రెడ్డి, గోపాలయ్య, శ్రీనివాసులు, సత్యంరాజు, చిరంజీవి పాల్గొన్నారు.

తాళ్వాయిపాడులో..

మండలంలోని తాళ్వాయిపాడులో మంగళవారం వీర్లయ్యస్వామి గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ కల్పన, నాయకులు వీరకుమార్, చంద్రయ్య, బాలసుబ్రమణ్యం, బాలయ్య, శ్రీనివాసులు, రామకృష్ణ, భాస్కర్ పాల్గొన్నారు.

ముగిసిన మాస్టర్స్ క్రికెట్ లీగ్



విన్నర్స్‌కు ట్రోఫీ అందిస్తున్న ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, తదితరులు

గూడూరురూరల్ : పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న మాస్టర్స్ క్రికెట్ లీగ్ సోమవారంతో ముగిసింది. కనుమూరు హరిచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నీలో బహుమతి ప్రదానోత్సవానికి వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఏటా క్రికెట్ పోటీలు ఏర్పాటు చేసి యువతను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు కోడూరు మీరారెడ్డి, మనపాటి రవీంద్రబాబు, శ్రీనివాసులు రెడ్డి, నాగేశ్వరరావు, లవకుమార్, సుబ్రమణ్యం, రాజేంద్ర పాల్గొన్నారు.

నేడు వెంకటగిరిలో 'గడప గడపకు'

వెంకటగిరిరూరల్ : పట్టణంలోని 8వ వార్డు ఎన్‌జీఓ కాలనీలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కార్యాలయం మంగళవారం తెలిపింది. ఉదయం 6.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరింది.

చింతాలమ్మకు పొంగళ్లు

ఓజిలి: మండలంలోని గుర్రంకొండలో గ్రామదేవత చింతాలమ్మకు మంగళవారం ఘనంగా పొంగళ్లు సమర్పించారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు పొంగించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ముపాళ్ల మాధవీలత, మాజీ సర్పంచ్ కొండూరు సురేష్‌రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండూరు వామన రాజు, ముపాళ్ల మోహన్‌రాజు, ముపాళ్ల ప్రతాప్‌రాజు పాల్గొన్నారు. అలాగే సగుటూరులో చింతాలమ్మకు పొంగళ్లు సమర్పించారు. వైస్ ఎంపీపీ లెక్కల ప్రసాద్‌నాయుడు, సర్పంచ్ పంజాం వసంతకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు పంజాం ప్రతాప్‌కుమార్, సుబ్బనాయుడు, సీవీ, జయరామయ్య పాల్గొన్నారు.

కండలేరులో 12.615 టీఎంసీలు

రాపూరు : కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 12.615 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 260 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5 , మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ కాలువకు 210 క్యూసెక్కుల నీరు విడుదలచేస్తున్నట్లు వివరించారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా కృషి



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

దక్కిలి : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా నేతలు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని వెంబులూరు, మిట్టవడ్డిపల్లె, కమ్మపల్లెలో ఆయన పర్యటించారు. ముందుగా గ్రామదేవత సీతాలమ్మకు పత్ర్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమన్యాయం చేశారన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మొత్తం 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ గెలుపొందడం తథ్యమని స్పష్టం చేశారు. వెంకటగిరి నియోజకవర్గానికి దివంగత నేత నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి ఎనలేని సేవలందించారని, ఈ విషయాన్ని ప్రజలే తనకు గుర్తుచేస్తున్నారని చెప్పారు. తాను ఎప్పుడూ అందరికీ అందుబాటులో ఉంటానని, ప్రజలు ఓటుతో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మాధవయ్యపాళెం సొసైటీ అధ్యక్షుడు నర్రావుల వేణుగోపాల్ నాయుడు , వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెట్లూరు జగన్‌మోహన్‌రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, స్తంభాలగిరీశ్వరయ్యస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నర్రావుల ప్రకాశం నాయుడు, ఆర్టీసీ రీజనల్ మాజీ చైర్మన్ చెలికం శంకరరెడ్డి, పులకంటి రామారావు, వేణు నాయుడు, శ్రీనివాసులు, నారాయణరెడ్డి, వేపమాను పెంచలయ్య, శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మతల్లి సేవలో ఎమ్మెల్సీ మేరిగ



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ మురళీధర్

రాపూరు : మండలంలోని వేపినాపి సమీపంలో వెలసిన అంకమ్మతల్లిని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ గూడూ రు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ క్రమంలో ముందుగా సంక్రాంతిపల్లెలోని పాపకన్ను గార్డెన్‌లో ఎమ్మెల్సీ మురళీధర్ వైఎస్సార్‌సీపీ నేత పాపకన్ను మధుసూదన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీని మధుసూదన్‌రెడ్డి సత్కరించారు. కార్యక్రమంలో పాపకన్ను వేణుగోపాల్‌రెడ్డి జేసీఎస్ కన్వీనర్ నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు శశిరెడ్డి, బాలకృష్ణారెడ్డి, కోటేశ్వరరెడ్డి, కలపాటి మధుసూదన్‌రెడ్డి, నార సింహారెడ్డి, దమ్మాయి రమణయ్య, గని, వరబాబు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న నాగరాజు

చిల్లకూరు : సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ఏరూరులోని శివగణేష్ మైదానంలో మంగళవారం ప్రారంభమైన క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. పీఏసీఎస్ అధ్యక్షుడు చేవూరు నాగరాజు తన తండ్రి చెంచురామయ్య జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన టోర్నీని ఆయన బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. తొలి మ్యాచ్‌లో పుట్టయ్య జట్టుపై అల్లీపురం జట్టు విజయం సాధించింది. అనంతరం జరిగిన మ్యాచ్‌లో బలిజపాళెం జట్టు ఎంపీ పాళెం జట్టుపై గెలుపొందింది. మూడు రోజులపాటు కొనసాగే ఈ టోర్నీలో విజేతలకు ట్రోఫీతోపాటు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

డ్రైవర్లకు ఏకాగ్రత తప్పనిసరి



సమావేశంలో డీఎం రామకృష్ణ

సైదాపురం(వెంకటగిరి) : విధి నిర్వహణలో డ్రైవర్లకు ఏకాగ్రత తప్పనిసరని వెంకటగిరి ఆర్టీసీ డిపో మేనేజర్ రామకృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక డిపోలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహించారు. డీఎం మాట్లాడుతూ ప్రయాణికులను క్షేమం గా గమ్యం చేర్చాలని, ఆర్టీసీ ఆదాయ బాటలో పయనించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పనిచేసి డిపోకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.